క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

సంగం: అమరపనాయుడుకండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టను గురువారం నిర్వహించారు. లగడపాటి రామలక్ష్మమ్మ పర్యవేక్షణలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



కావలి: దగదర్తి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తాళ్లూరి రమణయ్యనాయుడు మరణించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. దగదర్తిలోని నివాసానికి చేరుకుని రమణయ్యనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఎంపీడీఓ తనిఖీలు

దుత్తలూరు : దుత్తలూరు సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. పిల్లల హాజరు , మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించారు. హెచ్ఎం సుభాస్‌చంద్రబోస్, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, నాగేంద్ర ఉన్నారు.

పశుగ్రాసాల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

కలిగిరి/వరికుంటపాడు: ఉపాధిహామీ పథకం కింద బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సన్న, చిన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలిగిరి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ కె.సురేష్‌బాబు, వరికుంటపాడు పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ గురువారం తెలిపారు. 10 నుంచి 50 సెంట్ల వరకు పశుగ్రాసాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. ఈ ఏడాది మండలానికి 41 ఎకరాలు కేటాయించడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లోని వెటర్నరీ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు.

బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలి



దుత్తలూరు: బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ చొరవ చూపాలని ఎస్సై పీ ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా లార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గురువారం ఆవిష్కరించారు. లార్డ్ సంస్థ అధ్యక్షుడు నూనె ప్రసాద్, మదర్‌థెరిస్సా చిల్డ్రన్ హోమ్ అధినేత విజయమ్మ పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి నుడా నిధులు

ఆత్మకూరు: మున్సిపాలిటీకి నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ రూ.కోటి నిధులు మంజూరు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్ గురువారం తెలిపారు. తిరిగి చెల్లించే ప్రాతిపదికన మంజూరు చేసిన ఈ నిధులను మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నట్లు వివరించారు.

పోలీసుల పల్లెనిద్ర

ఆత్మకూరు: అప్పారావుపాళెంలో సీఐ గంగాధర్, ఎస్సై ఎస్‌కే జిలానీతో కలిసి డీఎస్పీ వేణుగోపాల్ గురువారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రచ్చబండ వద్ద ప్రజలతో మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగా పల్లె నిద్ర కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో కొత్త వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందజేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ రేపు

వరికుంటపాడు: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై శనివారం ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాలరావు గురువారం తెలిపారు. మండల పరిషత్ సమావేశం మందిరం, స్త్రీశక్తి భవనంలో జరిగే శిక్షణకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఓఏలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

అల్లూరు/ఆత్మకూరు /కొండాపురం/సంగం/మర్రిపాడు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు అల్లూరు శాఖ గ్రంథాలయంలో గురువారం ప్రారంభమయ్యాయి. లైబ్రేరియన్ కోటేశ్వరమ్మ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు, తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. అలాగే ఆత్మకూరు గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఓంకారం రాజు, కొండాపురం గ్రంథాలయంలో లైబ్రేరియన్ కొండయ్య, మర్రిపాడు గ్రంథాలయంలో లైబ్రేరియన్ నారాయణరావు, సంగం గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు.

అంగన్‌వాడీలపై ధరా భారం

భారీగా పెరిగిన నిత్యావసరాల ధరలు

- పాత చార్జీలతోనే మెనూను అమలు చేయాలంటున్న ప్రభుత్వం
- అప్పుల పాలవుతున్న అంగన్‌వాడీలు

సోమశిల: అంగన్‌వాడీలు నిత్యావసరాల ధరల భారంతో సతమతమవుతున్నారు. నిత్యావసరాల ధరలు పెరిగినా ప్రభుత్వం తాము చెప్పిన మెనూ ప్రకారమే చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలని చెబుతుండడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అప్పులు చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 408 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాల్సి ఉంటుంది. ఇందుకోసం అంగన్‌వాడీలకు ప్రభుత్వం బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, పాలు అందజేస్తుంది. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా అంగన్‌వాడీలు ఎంత మేరకు సరుకులు అవసరమో నివేదిక అందజేస్తే ఆ మేరకు పంపిణీ చేస్తారు. కందిపప్పు, బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా అంగన్‌వాడీలు ప్రతి నెలా తెచ్చుకోవాల్సి ఉంటుంది. సరుకులను తరలించుకునేందుకు, కేంద్రంలో జాగ్రత్తగా నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి నగదు చెల్లించదు. ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 5 గ్రాముల నూనెను మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తుంది. నెలసరి కూరగాయల కోసం రూ.800 చెల్లిస్తోంది. గ్యాస్ సిలెండర్ కోసం నెలకు రూ.400 ఇస్తుంది. వీటితోనే అంగన్‌వాడీలు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది.

భారీగా పెరిగిన ధరలతో..

ప్రస్తుతం కూరగాయల ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు వడ్డించేందుకు అంగన్‌వాడీలకు ప్రభుత్వం కూరగాయల నిమిత్తం నెలకు కేటాయించే రూ.800 సరిపోవడం లేదు. అప్పులు చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యాస్‌కు సైతం ప్రభుత్వం నగదు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో పలు సందర్భాల్లో సొంత నగదు పెట్టి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మెనూ తప్పక పాటించాలని చెప్పే ఉన్నతాధికారులు పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు అందించే నగదు మొత్తాన్ని కూడా మారిస్తే బాగుంటుందని అంగన్‌వాడీలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న ఉచిత గ్యాస్ అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా అందిస్తే తమకు చాలా ఉపయుక్తంగా ఉంటుందని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మెనూ చార్జీలను పెంచి అందిస్తే తమకు ఎంతో ఊరటగా ఉంటుందని పలువురు అంగన్‌వాడీలు పేర్కొంటున్నారు.

కేంద్రాల నిర్వహణకు సొంత నగదే

చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వచ్చే అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం సోపులు, చీపుర్లు, చాపలు, తదితరాల కొనుగోలుకు ప్రభుత్వం నగదు అందజేయాలి. అయితే ప్రభుత్వం నుంచి అందకపోతుండడంతో అంగన్‌వాడీలు తమ సొంత నగదును ఖర్చు చేసి కొనుగోలు చేసి వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం తింటున్న చిన్నారులు

ఆత్మకూరు నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య

సంగం	ఆత్మకూరు	చేజర్ల	ఏఎస్‌పేట	అనంతసాగరం	మర్రిపాడు
52	92	59	52	72	81

మెనూ ఇలా

సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	పులిహోర, టమాటో పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కాయగూరలతో సాంబారు
శుక్రవారం	కూరగాయల పప్పు
శనివారం	వెజిటబుల్ రైస్, ఆకుకూర, సాంబారు

ఉన్నతాధికారులకు నివేదించాం

అంగన్‌వాడీలు పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు అందించే నగదు పెంపు విషయాన్ని గతంలోనే మా దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అంగన్‌వాడీలకు కూరగాయలు, ఇతర అవసరాలకు అందజేస్తున్న నగదు పెంపు విషయమై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక సమర్పించాం.

– పద్మావతి, సీడీపీఓ, ఐసీడీఎస్

సూపర్ సిక్స్‌కు స్వస్తి పలికినట్లే

- బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించని కూటమి ప్రభుత్వం
- అబద్ధాలతో కాలం గడుపుతున్న బాబు
- 2026లో జమిలి ఎన్నికలు ఖాయం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కావలి: విలేకరులతో మాట్లాడుతున్న కాకాణి, ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: ఎన్నికలకు ముందు అట్టహాసంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికినట్లేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించిందన్నారు. గెలిచిన తరువాత అదిగో, ఇదిగో అంటూ అబద్ధాలతో కాలయాపన చేస్తూ చివరకు బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించకుండా సూపర్ సిక్స్‌ను అటకెక్కించిందని తెలిపారు. హామీలు నెరవేర్చడంలో విఫలమవడంతో పాటు ఉచిత ఇసుక, మట్టి తవ్వకాలు, మద్యం విక్రయాల్లో మాఫియాగా మారిందని ఆరోపించారు. విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ చార్జీల రూపంలో భారీగా పెంచడంతో పాటు ప్రజల నెత్తిన స్మార్ట్ మీటర్లు పెట్టడం, డిస్కంలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడాన్ని రాష్ట్రమంతా గమనిస్తుందన్నారు. 2026లో జమిలి ఎన్నికలు రావడం ఖాయమని, ఈ రెండేళ్లు మాత్రమే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందన్నారు. జమిలి ఎన్నికల్లో ఈసారి వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గం రూపురేఖలు మార్చే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్ నిర్మాణం వైఎస్సార్ సీపీ హయాంలోనే పూర్తయ్యాయని గుర్తుచేశారు. కావలిని కనకపట్నంగా మారుస్తామని ప్రగల్భాలు పలికిన టీడీపీ నాయకులు కలుగోళమ్మ దేవస్థానం వద్ద ఫ్లయిఓవర్, ట్రంక్ రోడ్డు, దగదర్తి విమానాశ్రయం, సంగం బైపాస్ కెనాల్ నిర్మాణం దిశగా ఎటువంటి ప్రయత్నాలు చేయలేక సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో వైఎస్సార్‌సీపీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలకు నోటీసులు ఇవ్వడం, స్టేషన్ బయటకు తీసుకెళ్లి కొట్టడం చేస్తున్నారని, దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలి



జలదంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్న సీపీఎం నాయకులు



మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరురూరల్/ అనుమసముద్రంపేట/ జలదంకి/సోమశిల/మర్రిపాడు/ఉదయగిరి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ట్రూఆఫ్ చార్జీల భారాన్ని తగ్గించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం కష్టమైందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని, ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జలదంకి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కార్యదర్శి రావి మాల్యాద్రి, ఏఎస్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జీ లక్ష్మీపతి, అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా, మర్రిపాడు తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసుల విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించడం తగదని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి డీఎస్పీ శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు ఫిర్యాదుల నేపథ్యంలో డీఎస్పీని ఆయన గురువారం కలిసి కేసుల విషయమై చర్చించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులను, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయాందోళనలకు గురిచేసి ఇబ్బందులు పెట్టే లక్ష్యంతో టీడీపీ నాయకులు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎటువంటి విచారణ లేకుండా, సాంకేతికంగా నిర్ధారించుకోకుండా కేసులు నమోదు చేయడం, దుర్భాషలాడడం సరికాదన్నారు. సోషల్ మీడియాలో నీచాతినీచంగా టీడీపీ నాయకులు పెడుతున్న పోస్టులపై కూడా తాము ఫిర్యాదు చేస్తున్నామని, వాటిపైన కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తనపై కూడా సోషల్ మీడియాలో అసత్యాలు, అబద్ధపు పోస్టులు పెట్టారని వాటిపై కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై దుందుడుకు చర్యలకు దిగితే న్యాయపరంగా ముందుకెళతామని స్పష్టం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



డీఎస్పీతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

జలదంకి: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీకెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని ఎస్సై లతీఫున్నీసా పేర్కొన్నారు. జలదంకి, జమ్మలపాళెం, బ్రాహ్మణక్రాక గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు గురువారం ఎస్సై అవగాహన కల్పించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార కేంద్రాల వద్ద సీసీకెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలోని దుకాణదారులతో సమావేశం నిర్వహించి వారితో పాటు దాతల సహకారాన్ని తీసుకుని సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు తమ వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు.



జమ్మలపాళెంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఉచిత వైద్యశిబిరం



సీతారామపురం: మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో డీఎస్ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు కోటేశ్వరరావు, వినయ్ కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఫాదర్ ఫ్రాన్సిస్, ఎస్ఎఫ్‌డీ సంస్థ చైర్మన్ కలివెల ఎలీషాకుమార్ పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

ఘనంగా బాలల దినోత్సవం

కావలి: నేటి బాలలే రేపటి పౌరులని, బాలలు చిన్ననాటి నుంచే ఉత్తమ లక్షణాలను అలవర్చుకుని మంచి పౌరులుగా ఎదగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని జవహర్‌భారతి కళాశాలలోని ఎంఎం హాల్లో డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ డీఆర్ పేరు మీదుగా పట్టణ, మండల స్థాయి పాఠశాలల విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. కావలి డీఎస్పీ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా చిన్నారులకు బహుమతులు అందజేశారు. తొలుత దేశ తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వోదయ రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, నిర్వాహకులు జ్యోతిశ్రీ, ప్రసాద్‌రెడ్డి, మాల్యాద్రి, జేబీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు గ్రంథాలయంలో ఓంకారం రాజు, ఆర్టీఏ కార్యాలయంలో ఎంవీఐ బీ రాములు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగా ప్రసాద్, అటవీ శాఖ కార్యాలయంలో రేంజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని నిర్వహించారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ ఆదిశేషయ్య, డాక్టర్ మస్తానయ్య, ఆయూష్ ఆస్పత్రుల్లో చిన్నారులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జీవీ నారాయణరావు, చలమయ్య, వెలిశెట్టి నారాయణరావు పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పీ యల్లయ్య, అధ్యాపకులు మల్లేశ్వరరావు, శ్రీధర్, సందానిబాషా,సుబ్బారావు, ప్రసాద్, కామాక్షమ్మ పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మహిమలూరు, కనుపూరుపల్లి, వెన్నవాడ, ఆరవీడు, బట్టేపాడు, దేపూరు, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నెహ్రూ వేషధారణలో విద్యార్థులు మల్లేశ్వర్, మనోజ్, మల్లికార్జున ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ,మహేష్, వెంకటేశ్వర్లు, మదీనా, మాధవి, కృష్ణారెడ్డి, పెదయ్య పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక వేదగర్భ పాఠశాలలో బాలలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బాలలు ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్లు బొల్లు రామ్మోహన్, కనుమర్లపూడి పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

జలదంకి: మండలంలోని పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

దుత్తలూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుత్తలూరులోని విశ్వతేజ పాఠశాలలో కరస్పాండెంట్ డీ వాసుదేవరెడ్డి చిన్నారులతో కేక్ కట్ చేయించి పంచిపెట్టారు.

ఉదయగిరి: స్థానిక ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి విద్యార్థులచే కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సీతారామపురంలో నెహ్రూకు నివాళులర్పిస్తున్న చిన్నారులు



దుత్తలూరులోని విశ్వతేజ పాఠశాలలో..



ఆత్మకూరురూరల్: మహిమలూరులో..



ఆత్మకూరురూరల్: వెన్నవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో..



సోమశిల: చిలకలమర్రి జెడ్పీహైస్కూల్‌లో..



ఆత్మకూరు: గ్రంథాలయంలో..



వరికుంటపాడులో..



చేజర్ల ప్రభుత్వ కళాశాలలో..

ఆర్ఎస్సార్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

కావలి: గౌరవరంలోని ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం నిర్వహించారు. మానవుడి సగటు ఆయుష్షును పెంచడంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగం సాధించిన పురోగతిని వివరించేలా ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఆర్ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, తదితరులు విద్యార్థుల ప్రదర్శనలు, ఆవిష్కరణలు తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి ఆదిలక్ష్మి, కరస్పాండెంట్ రామిరెడ్డి బాల సాకేత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ మంత్రి కాకాణి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

సీతారామపురం: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు.. పోలంగారిపల్లి వద్ద బైక్ అదుపుతప్పిన ఘటనలో దేవమ్మచెరువుకు చెందిన ఏడుకొండలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని స్థానికులు 108 వాహనంలో ఉదయగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అలాగే దేవమ్మచెరువు మాజీ సర్పంచ్ బూమయ్యగారి శ్రీనివాసులు నెమళ్లదిన్నె నుంచి వస్తుండగా బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.



గాయపడిన ఏడుకొండలు

సాగునీటి సంఘాల ఎన్నికలను బాధ్యతగా నిర్వహించాలి

ఆత్మకూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలోని 95 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, అందుకు కేటాయించిన సిబ్బంది బాధ్యతగా తమ విధులు నిర్వహించాలని సోమశిల ప్రాజెక్ట్-4 ఈఈ వెంకటరమణారెడ్డి అన్నారు. ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. సోమశిల ప్రాజెక్ట్ ఈఈ వెంకట రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీసీలోని సభ్యులే ఎన్నికల్లో పోటీ చేయాలని, వారిని బలపరిచేవారు అదే టీసీకి చెందిన ఓటు కలిగిన వ్యక్తి అయి ఉండాలని తెలిపారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల సిబ్బందే పూర్తి చేయాలని, వాటిపై పోటీచేసే అభ్యర్థితో సంతకాలు మాత్రమే చేయించాల్సి ఉంటుందని వివరించారు. పోటీ చేసే వ్యక్తి నామినేషన్ దాఖలు సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎన్నికల్లో సమానంగా ఓట్లు వస్తే లాటరీ పద్ధతిలో విజేతను నిర్ణయించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి సందేహాలు వచ్చినా తనను సంప్రదించాలని ఈఈ వెంకటేశ్వర్లు సూచించారు.



శిక్షణ ఇస్తున్న ఈఈలు

పెన్నా తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: అల్పపీడనం ప్రభావంతో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలు మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలియజేస్తున్న క్రమంలో పెన్నా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని సూచించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వర్షాలు కురుస్తున్నందున ఆయా మండలాల అధికారులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ, ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నట్లు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక వీఆర్వో, తహసీల్దార్, పంచాయతీల సిబ్బందిని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.